క్లుప్తంగా

ముగిసిన తపాలా శాఖ వారోత్సవాలు



హెడ్‌పోస్టాఫీసు వద్ద పోస్ట్‌మెన్స్‌ను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: భారత తపాలా శాఖ వారోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం భీమవరం హెచ్‌పోస్టాఫీసులో పోస్ట్‌మెన్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏపీఐవీసీడైరెక్టర్ చెనమల్ల చంద్రశేఖర్, మెంటే పార్థసారధి మాట్లాడుతూ పోస్ట్‌మెన్స్ సేవలు అభినందనీయమని, తపాలశాఖలో పోస్ట్‌మెన్ పాత్ర ఎంతో కీలకమన్నారు. కేజీఆర్‌ఎల్ కళాశాల జాయింట్ సెక్రటరీ అరేటి ప్రకాష్, హెడ్‌పోస్ట్ మాస్టర్ పి.రాజు, చెరుకువాడ రంగసాయి, అరసవల్లి సుబ్రమణ్యం, భట్టిప్రోలు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సీపీఆర్‌పై శిక్షణ



కేజీఆర్‌ఎల్ కళాశాలలో సీపీఆర్‌పై శిక్షణ ఇస్తున్న దృశ్యం

భీమవరం: స్థానిక కేజీఆర్‌ఎల్ కళాశాలలో గురువారం విద్యార్థులకు మిత్రా మెడికేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో సీపీఆర్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మేడిది సతీష్, అరేటి మురళి, అనుష తదితరులు సీపీఆర్ ప్రాముఖ్యతను వివరించారు. గుండె ఆగిపోతే వెంటనే స్పందించే సాంకేతికతలు నేర్చుకోవడం ప్రతి ఒక్కరికీ అవసరమన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మెంటే రామ్‌మనోహర్, ట్రెజరర్ గన్నాబత్తుల శ్రీనివాస్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వేండ్ర హైస్కూల్ సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ ఆనంద హరిప్రసాద్

పాలకోడేరు: మండలంలోని వేండ్ర ఉన్నత పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి-2 శ్రీహరి ఆనంద ప్రసాద్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది కూడా పదో తరగతి విద్యార్థుల విషయంలో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, మంచి ఫలితాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జీవీవీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఎం.వెంకటరమణ, జె.శ్రీనివాసు, పంపన సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ ప్రచార కార్యక్రమంలో భాగంగా జీఎస్టీ తగ్గింపుతో ఆటోమొబైల్ రంగంలో ప్రజలకు చేకూరిన ప్రయోజనాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. వాహనాలపై భారీ మొత్తంలో జీఎస్టీ తగ్గింపు కారణంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు రవాణా శాఖ, వాణిజ్య పన్నుల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం భీమవరం లూథర్న్ హై స్కూల్ గ్రౌండ్ నుంచి వాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ కె.పి శైలజ, జిల్లా రవాణా అధికారి కే.ఎస్.ఎం.వి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

లంకలకోడేరులో 'పొలం బడి'

పాలకొల్లు సెంట్రల్: వరి పొలంలో విచక్షణారహితంగా పురుగుమందులు వాడకూడదని, అవసరం మేరకే పురుగు మందులు వాడాలని జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వర్లు కోరారు. లంకలకోడేరు గ్రామంలో గురువారం నిర్వహించిన పొలం బడి కార్యక్రమంలో ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. ఎరువుల విషయంలో యూరియా సూపర్ పొటాష్‌తోపాటుగా పచ్చిరొట్ట పైరులను వేసి నేల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు. పాలకొల్లు సహాయ వ్యవసాయ సంచాలకులు పలివెల మురళీకృష్ణ ప్రస్తుతం వరి పంటను ఆశించిన ఆకు ముడత, తాటాకు తెగులు నివారణ చర్యలు రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.రాజశేఖర్, రైతులు శ్యాము, రామకృష్ణ, బాలకృష్ణ, సత్యనారాయణ గ్రామ వ్యవసాయ సహాయకులు సురేష్, సాయి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ లీకుల బాధ తీరేదెన్నడు?

- లీకులతో కలుషితం అవుతున్న మంచినీళ్లు
- పట్టణంలో 20 చోట్ల పైపు లీకులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరంలోని కలుషితమవుతున్న మంచినీళ్ల వల్ల భీమరం ప్రజల ఆరోగ్యానికి ముప్పు పొంచి ఉంది. పట్టణంలో పలు చోట్ల పైపు లీకేజీల వల్ల ఫిల్టర్ చేసిన మంచినీళ్లు డ్రెయినేజి నీళ్లు, మురికినీళ్లతో కలిసి పైపులు ద్వారా వెళ్తుతున్నాయి. పైపులు లీకేజీలు ఏర్పడి నెలలు గడిచినా మున్సిపల్ అధికారులు వాటి మరమ్మతులకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఎక్కడైనా ప్రధాన సెంటర్‌లో లీకేజి ఉంటే అక్కడ మాత్రమే మరమ్మతులు చేసి మిగిలిన వాటిని వదిలివేస్తున్నారు.

వేల లీటర్ల నీళ్ల వృథా

పట్టణానికి భీమవరం హెడ్ వాటర్ వర్క్స్‌లో ఫిల్టర్ చేసిన మంచినీళ్లు పైపుల ద్వారా రిజ్వర్వాయర్‌లోకి నింపి అక్కడ నుంచి పైపుల ద్వారా పట్టణంలోకి ఇళ్లకు కుళాయిలు ద్వారా సరఫరా చేస్తున్నారు. నీళ్లు అందని ప్రాంతాలకు ట్యాంకర్లు ద్వారా సరఫరా చేస్తున్నారు. అయితే పైపులకు లీకులు ఏర్పడిన వెంటనే మరమ్మతులు చేయకపోవడంతో ఫిల్టర్ చేసిన మంచినీళ్లు రోజుకు వేల లీటర్లు ఉదయం, సాయంత్రం వృథాగా పోతున్నాయి. పట్టణంలో 20 వరకు పైపు లీకేజీలు ఉన్నాయి. ఆదాయం ఉండి వేగంగా లీకేజీలను మరమ్మతులు చేయించే సామర్థ్యం కలిగిన మున్సిపాలిటిలో పైపుల లీకేజీలు నెలల తరబడి ఉండిపోవడానికి కారణం వాటర్ సరఫరా అధికారుల నిర్లక్ష్యమేనని ప్రజలు మండిపడుతున్నారు.

ప్రత్యేక అధికారి దృష్టి పెట్టాలని కోరుతున్న ప్రజలు

భీమవరం పట్టణంలో పైపు లీకేజిల వల్ల ప్రజా ఆరోగ్యం దెబ్బతినే పరిస్థితి ఉన్న నేపథ్యంలో మున్సిపాలిటి ప్రత్యేక అధికారిగా ఉన్న ఆర్డీఓ ప్రవీణ్ కుమార్‌రెడ్డి దృష్టిపెట్టి పైపుల లీకేజిల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. లీకేజిలు మరమ్మతుల విషయంలో నిర్లక్ష్యంగా ఉన్న వాటర్ సరఫరా విభాగం అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పట్టణంలో పైపుల లీకేజీలు ఇలా

- దుర్గాపురం వాటర్ రిజ్వాయర్ వద్ద
- రామ్‌లక్ష్మణ్ నగర్‌లో ప్రధాన రహదారికి ఆనుకుని
- పిసిఆర్ కళ్యాణ మండపం పిపి రోడ్డుకు ఆనుకుని
- బ్రౌనింగ్ కళాశాల గేటు వద్ద
- రియలన్స్ బంకు వద్ద మూడు చోట్ల
- చినరంగని పాలెం ఆంధ్రా బ్యాంకు వద్ద
- అన్నపూర్ణ థియేటర్ ఎదురుగా హోటల్ వద్ద
- మౌర్య హోటల్ వెనుక మూడు చోట్ల
- టూటౌన్ విస్సు లాడ్జి ఎదురుగా
- జంక్షన్ రైల్వే స్టేషన్ రోడ్డులో
- బీజేపీ కార్యాలయం సమీపంలో..
- కలెక్టరేట్ సమీపంలో మల్లితోట ఏరియాలో...



పీసీఆర్ కల్యాణ మండపం సమీపంలో పైపు లీకేజ్ వల్ల డ్రెయినేజీ నీళ్లు కలుషితం అవుతున్న దృశ్యం



అన్నపూర్ణ థియేటర్ వద్ద డ్రెయినేజీల్లోకి వృథాగాపోతున్న మంచినీళ్లు



టూటౌన్‌లో ఏర్పడిన పైపు లీకేజీ ద్వారా బయటకుపోతున్న మంచినీళ్లు

మంచినీళ్లు మురికిగా వస్తున్నాయి



పైపుల ద్వారా కుళాయిలకు వచ్చే నీళ్లు రంగుమారి మురికిగా వస్తున్నాయి. కాచికుని తాగడం లేదా బయట నుంచి మంచినీళ్లు తెచ్చుకుంటున్నాం. పైపుల ద్వారా సురక్షితమైన మంచినీళ్లు రావడం లేదు. నీళ్లు ఎందుకు కలుషితం అవుతున్నాయో? అధికారులు పరిశీలించి సురక్షితమైన మంచినీళ్లు సరఫరా చేయాలి. ఆనీళ్లు తాగితే రోగాలు పాలువడం ఖాయం.

– హర్ష, భీమవరం 4 వార్డు

వర్షం పడినప్పుడు అవస్థలు



వర్షం పడిన ప్రతిసారీ మున్సిపాలిటీ ద్వారా సరఫరా చేస్తున్న మంచినీళ్లు మురికిగా వస్తాయి. అవీ తాగడానికి పనికిరావు. ఆ సమయంలో చాలా ఇబ్బందులు పడుతున్నాం. సాధారణ సమయంలో కూడా ఒక్కోసారి మురికిగా వస్తున్నాయి. మున్సిపల్ అధికారులు పట్టించుకుని మంచినీళ్లు ఎక్కడ కలుషితం అవుతున్నాయో? గుర్తించి తగు చర్యలు తీసుకుని సురక్షితమైన మంచినీళ్లు సరఫరా చేయాలి.

– పాలవెల్లి మంగ, భీమవరం 2 వార్డు

ఆక్వా యాజమాన్య పద్ధతులపై శిక్షణ

ఉండి: ఆక్వా యాజమాన్య పద్ధతులపై ఎన్నార్పీ అగ్రహారంలోని మత్స్యపరిశోధనా కేంద్రంలో నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభించినట్లు ప్రధాన శాస్త్రవేత్త చంద్రశేఖర్ తెలిపారు. ఆక్వాలో మేతల తయారీ, యాజమాన్యంపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులకు వివిధ కళాశాలల నుంచి విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మల్లికార్జునరావు, మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ ఎ.శ్రీనివాస్, విశ్రాంత శాస్త్రవేత్త పి.రంగాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

కాళ్ల: మారుమూల గ్రామాలను సైతం అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఏపీ డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. మండలంలోని దొడ్డనపూడి గ్రామంలో గ్రామ సచివాలయ భవనాన్ని గురువారం సర్పంచ్ కొల్లి సుబ్బారావుతో కలిసి ప్రారంభించారు. అలాగే అయ్యప్ప మాలధారులకు ఏర్పాటు చేసిన భోజనాలను కూడా ప్రారంభించారు. కార్యక్రమంలో ఆరేటి వెంకటరత్నప్రసాద్, ఎంపీపీ పెన్మెత్స శిరీషవిశ్వనాధరాజు, జుత్తిగ నాగరాజు, ఎరుబండి రామాంజనేయులు పాల్గొన్నారు.

తాళ్లకోడు కాలనీ పరిశీలన



కాలనీని పరిశీలిస్తున్న అధికారులు

ఆకివీడు: ప్రతిష్టాత్మకంగా నిర్మించిన తాళ్లకోడులోని జగనన్న పేదల కాలనీని హౌసింగ్ రాష్ట్ర ఎండీ అరుణ్ బాబు గురువారం సందర్శించారు. కాలనీలోని ఇళ్ల నిర్మాణం, రహదారులు, ఇతర మౌలిక వసతులను పరిశీలించారు. ఇళ్ల నిర్మాణంపై ఆయన హౌసింగ్ అధికారులను ఆరా తీశారు. అనంతరం నిర్మాణం పూర్తి చేసుకున్న నాలుగు గృహాలకు రంగులు వేసి, ముస్తాబు చేయాలని ఆదేశించారు. కాగా జగనన్న కాలనీని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సందర్శించే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో హౌసింగ్ ఎండీ పర్యటన కొనసాగిందని హౌసింగ్ అధికారులు చెబుతున్నారు. ఆయన వెంట జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి, హౌసింగ్ జిల్లా మేనేజర్ పిచ్చయ్య, డీఈ శివరామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ, వైస్ ఎంపీపీలు లేకుండానే..!

పెనుగొండ: పెనుగొండ మండల పరిషత్ సమావేశం గురువారం ఉత్కంఠభరిత వాతావరణంలో జరిగింది. ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీలు పాలపర్తి సుబ్రహ్మణ్యం, తోలేటి శ్రీనులు హాజరుకాకుండానే ఎంపీడీఓ టి.సూర్యనారాయణ మూర్తి సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ హాజరై శాఖల అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. 16న సమావేశం నిర్వహిస్తున్నట్లు ముందస్తు సమాచారం ఇవ్వకపోవడం, ఎంపీడీఓ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం, సమీక్షకు ఎంఎల్ఏ పితాని సత్యనారాయణ హాజరవుతున్నట్లు ముందస్తు సమాచారం ఇవ్వకపోవడం, అజెండాలోని అంశాలు ప్రస్తావించకపోవడం వంటి అంశాలపై పట్టుబడుతూ వైఎస్సార్ సీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యులు లు సమావేశానికి దూరంగా ఉండాలని నిర్ణయించారు. అయితే కొందరు ఎంపీటీసీ సభ్యులను అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు బ్రతిమాలడుకొని, ఇతర హామీలు ఎరచూపి హాజరయ్యేటట్టు గట్టి ప్రయత్నాలు చేయడంతో గురువారం ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, ఇతర వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులులు హజరు కాకుండానే సమావేశం నిర్వహించారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీలు హాజరు కాకపోవడంతో నడిపూడికి చెందిన ఎంపీటీసీ కట్లమ్మను ప్రోటోకాల్ ఎంపీపీగా నిర్ణయించి, కట్లమ్మ అధ్యక్షతను మండల పరిషత్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీసీ టిసూర్యనారాయణ మూర్తి, తహసీల్దారు జి.అనిత కుమారి, ఇతర శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వెంకన్న హుండీల ఆదాయం లెక్కింపు

భీమవరం (ప్రకాశంచౌక్): దంతులూరి జగన్నాథరాజు సత్రం అనుబంద సంస్థ శ్రీపద్మావతి వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం హుండీల ఆదాయాన్ని లెక్కించారు. 205 రోజులకు గానూ రూ.9,81,930 ఆదాయం వచ్చిందని ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు విలేకరులకు తెలిపారు. కార్యక్రమంలో మంతెన రామ్‌కుమార్‌రాజు, వర్ధినీడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి

పెనుమంట్ర: సైబర్ నేరాలపై వృద్ధులు అవగాహన పెంచుకుని తమ సెల్‌ఫోన్ వినియోగంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఉమ్మడి తెలుగురాష్ట్రాల వెల్ఫేజ్ ప్రాజెక్టు కోఆర్డినేటర్(మేనేజర్) శ్యామ్‌కుమార్ అన్నారు. గురువారం మార్టేరు రోటరీ భవనంలో పెనుమంట్ర మండల సీనియర్ సిటిజన్లకు సైబర్‌నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ చేస్తూ సీనియర్ సిటిజన్స్‌కు సెల్‌ఫోన్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

సంపూర్ణ ఆరోగ్యానికి సమతుల ఆహారం



ఆకివీడు: అజ్జమూరు ఎంపీపీ స్కూల్ ఆవరణలోమొక్కలు నాటుతున్న ఏఓ ప్రియదర్శిని



కాళ్ల: వైద్య శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: సంపూర్ణ ఆరోగ్యానికి సమతుల ఆహారమే ముఖ్యమని మండల వ్యవసాయాధికారి ప్రియదర్శిని చెప్పారు. మండలంలోని అజ్జమూరు గరువులోని ఎంపీపీ పాఠశాల ఆవరణలో గురువారం ప్రపంచ ఆహార దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆహార ధాన్యాలు పండించే రైతుల వెనుక ఎంతో కష్టం ఉందన్నారు. ఆహార ధాన్యాల ఉత్పత్తి వెనుక ఎన్నో అనుబంధ సంస్థల సహకారం ఉందన్నారు. ప్రధానోపాధ్యాయుడు ఆర్వీఎస్ నారాయణ మాట్లాడుతూ ఆహార వ్యర్థాలను తగ్గించడం ద్వారా ఆహార దినోత్సవానికి సార్థకత ఏర్పడుతుందన్నారు.

కాళ్లలో...

కాళ్ల: సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలంటే ప్రతి వ్యక్తీ ఆకుకూరలు, కాయగూరలు ఉపయోగించాలని భీమవరం ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు అన్నారు. స్థానిక ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఉన్నత భారత్ అభియాన్ సెల్ విభాగం ఆధ్వర్యంలో మండలంలోని పెద అమిరం గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద × ప్రపంచ ఆహార దినోత్సవం ను పురస్కరించుకుని ఆహార భద్రత సదస్సు, ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కంటి వైద్య శిబిరాన్ని గ్రామపంచాయతీ సర్పంచ్ డి.సోమేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం యూబీఏ పెదఅమీరం కో-ఆర్డినేటర్ డాక్టర్ కేఎం గణేష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు మాట్లాడుతూ ఆహార అలవాట్లను బట్టి ఆరోగ్యం కూడా ఉంటుందని సరైన ఆహారం తీసుకోకుండా బయట లభ్యమయ్యే జంక్ ఫుడ్స్‌ను వాడితే ఒబిసిటీతో పాటు రకరకాల వ్యాధులు సోకే ప్రమాదం ఉందనీ హెచ్చరించారు. కార్యక్రమంలో వెట్ సెంటర్ హెడ్ డాక్టర్ ఆర్.వేణు రెడ్డి, యూబీఏ కోఆర్డినేటర్ డాక్టర్ రాంబాబు, డాక్టర్ జి.సూరిబాబు, డాక్టర్ పి.రఘురాం, జీవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ కాలనీలో సమస్యలు పరిష్కరించాలి



ప్రకాష్‌నగర్ ఎసిటీ కాలనీలో సమస్యలు పరిష్కరించాలని ధర్నా చేస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని 29వ వార్డు ప్రకాష్ నగర్ ఎసిటీ కాలనీలో సమస్యలు పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో గురువారం మునిసిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణనాయకుడు ఎం.వైకుంఠరావు మాట్లాడుతూ ప్రకాష్‌నగర్ ఎస్టీ కాలనీలో వంద కుటుంబాలు జీవనం సాగిస్తున్నారని అక్కడి ప్రజలు తాగునీరు, డ్రెయినేజీ, వ్యక్తిగత మరుగుదొడ్ల సమస్యలతో సతమతమవుతున్నారు. అక్కడి సమస్యలు పరిష్కరించాలని గతంలో సీపీఎం చేసిన పోరాటాల ఫలితంగా రెండు పబ్లిక్ ట్యాప్‌లు వేసినా కుళాయిల నుంచి నీరు రావడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు స్పందించి సత్వరం సమస్యలు పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం మునిసిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చెల్లబోయిన వెంకటేశ్వరరావు, డి.త్రిమూర్తులు, సంజీవరావు, దుర్గారావు, మరియమ్మ, యోహాను అక్కులయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల వారోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ



వారోత్సవాల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఏఎస్పీ భీమారావు

భీమవరం: పోలీసుశాఖ, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహించే పోలీసు అమరవీరుల వారోత్సవాల బ్రోచర్‌ను గురువారం భీమవరం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ వి.భీమారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పోలీసుశాఖ ఉత్తర్వుల మేరకు ఈ నెల 21 నుంచి 31 వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమ నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పోలీసులకు ప్రజలు కూడా సహకరిస్తే మరింత ప్రతిష్టంగా భద్రత కల్పిస్తారన్నారు. వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కేవీవీఎస్ సత్యనారాయణ, ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం



వీరవాసరంలో బాలికా దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

వీరవాసరం: అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా గురువారం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ భీమవరం ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వీరవాసరం మండలంలో గల వివిధ 7 ఉన్నత పాఠశాలల్లో వ్యాసరచన డిబేట్ పోటీలు నిర్వహించి సెలక్ట్ అయిన 14 మంది విద్యార్థినులకు స్థానిక ఎంఆర్‌కే ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పీబీవీఎల్ సరోజినీ, పీహెచ్‌ఎస్ లీలావతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం వీరవాసరం కాపు వనిత క్లబ్ కాపు సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పాఠశాల ఆవరణలో నిర్వహించారు. వనిత క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ బి.లక్ష్మీకళ్యాణి, కాపు సర్వీస్ క్లబ్ అధ్యక్షులు గుండా రామకృష్ణ, కుంచె వేణు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



దాత కృష్ణారావును సత్కరిస్తున్న అధికారులు

కాళ్ల: ప్రభుత్వ కార్యాలయాల అభివృద్ధికి దాతలు అందిస్తున్న ప్రోత్సాహం మరువలేనిదని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.జీవన్ ప్రతాప్ అన్నారు. కాళ్ల వ్యవసాయ శాఖ కార్యాలయంలో గురువారం రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఓ కార్యాలయం గతంలో శిథిలావస్థకు చేరి ఎంతో అధ్వానంగా ఉండేదని, రైతులు కూడా అక్కడికి రావడానికి ఇబ్బందులు పడేవారన్నారు. నిధులు లేక ఏఓ రమేశ్ నాయుడు దాతలను సంప్రదించడంతో దాతలే దగ్గరుండి పనులు చేయించడంతో భవనం రూపురేఖలు మారిపోయాయన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ కార్యాలయం సుందరంగా రూపుదిద్దుకోవటానికి కారణమైన దాత తోట కృష్ణారావుని అధికారులు ఘనంగా సత్కరించారు.

నకిలీ మద్యంపై కదం తొక్కిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



మోటార్‌సైకిల్ ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: మద్యం ప్రియుల ప్రాణాలు తీస్తున్న నకిలీ మద్యంపై నరసాపురం వైఎస్సార్ సీపీ శ్రేణులు కన్నెర్ర చేశాయి. నకిలీ మద్యాన్ని అరికట్టాలని, వీధివీధినా వెలిసిన బెల్ట్‌షాపులు నిరోధించాలని కోరుతూ గురువారం పట్టణంలో భారీ నిరసన ప్రదర్శన చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు నేతృత్వంలో మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఇదేమి ప్రభుత్వం.. ఇదేమి ప్రభుత్వం..ప్రజలు ప్రాణాలు తీస్తున్న దుర్మార్గ ప్రభుత్వం అంటూ నినాదాలు చేశారు. పార్టీ కార్యాలయం నుంచి ఎక్సైజ్ సీఐ కార్యాలయం వరకూ ప్రదర్శన సాగింది. మెయిన్‌రోడ్డు, పంజాసెంటర్ మీదుగా ర్యాలీలో వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎక్సైజ్ కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళన చేశారు. అనంతరం ఎక్సైజ్ సీఐ రాంబాబుకు వినతిపత్రం ఇచ్చి, నకిలీ మద్యం అంశంలో పరిస్థితి మారకుంటే భవిష్యత్‌లో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు కామన బుజ్జి, ఉంగరాల రమేష్, మొగల్తూరు మండల అధ్యక్షుడు రేవు నారాయణరాజు, సీనియర్ నేతలు షేక్ బులిమస్తాన్, బర్రి శంకరం, బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శులు దొంగమురళి, కర్రి ఏసుబాబు, మత్స్యకారనేతలు తిరుమాని నాగరాజు, అండ్రాజు చల్లారావు, కౌన్సిలర్లు సిర్రా కాంతమ్మ, వంగా శ్రీకాంత్ కన్నా, యర్రా శ్రీను, అడిదల శరత్, కావలి నాని, మల్లాడి బుజ్జి, జిల్లెళ్ల దిలీప్, సోషల్‌మీడియా జిల్లా కన్వీనర్ బందన పూర్ణచంద్రరావు, వల్లభాని శేఖర్, ట్రేడ్‌యూనియన్ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎండీ షానవాజ్‌ఖాన్, యూత్ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు చినిమిల్లి చందు, వివిధ విభాగాల పార్టీ నేతలు పోలిశెట్టి గోపీనాథ్, తిర్రే బాబూరావు, కొల్లాబత్తుల రవికుమార్, కాకిలేటి ఆనంద్, రేవు రాంబాబు, పాలా రాంబాబు, తిరుమాని కృష్ణంరాజు, తెన్నేటి గిరి, బళ్ల తాతాజీ, తోట సుబ్బారావు, నిప్పులేటి సత్యనారాయణ, బాషాఖాన్, మాజీ సర్పంచ్ చల్లా సత్యనారాయణ, చదలవాడ మెర్లిన్, నడపన చిన్ని, బిళ్ల బ్రదర్స్, దొండపాటి వెంకట్, ఒడుగు సత్యనారాయణ, కనుమూరి ఆంజనేయులు, కడలి పెద్దిరాజు, కడలి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.